# సాక్షి

## అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం। 30। ఆగస్టు। 2023






**ఆదాయాన్ని పెంచాలి**

పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్ పీవో జీఎల్ఎన్ రాఘవన్ తెలిపారు. 8లో



**ప్రకృతి సేద్యంపై అధ్యయనం**

ప్రకృతి సేద్యంపై నేపాల్ బృందం అధ్యయనం చేసింది. డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు మండలాల్లో పర్యటించింది. 8లో



**ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం**

పాడేరులో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.పలు పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. 8లో

## న్యూస్‌రీల్

### కలెక్టర్‌కు బ్రహ్మకుమారీల రక్షాబంధన్



కలెక్టర్ సుమిత్ కుమార్‌కు రాఖీలు కడుతున్న ఈశ్వరీయ బ్రహ్మకుమారీలు

**సాక్షి,పాడేరు:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీలు మంగళవారం రాఖీలు కట్టారు. అనంతరం సుప్రీంసోల్ పటాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం రైల్వే న్యూకాలనీ శాఖ, అల్లూరి జిల్లాశాఖ బ్రహ్మకుమారీల ఇన్‌చార్జిలు సోదరి శశికళ,కేధర్ గౌరీ పాల్గొన్నారు.

### టూరిజం ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు

**అరకులోయ రూరల్:** స్థానిక ఏపీ టూరిజం హరిత అతిథి గృహంలో టూరిజం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.వి.నరసింహ,ఉపాధ్యక్షులుగా ఎ.సంజీవరావు, గురువులు, జనరల్ సెక్రటరీగా వి.అంజలిరావు, జాయింట్ సెక్రటరీలుగా సురేష్, బుద్దురాజు, కోశాధికారులుగా ధర్మ, సన్యాసమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 10 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మహేష్,బాబురావు, చిరంజీవి, నగేష, విజయ్ పాల్గొన్నారు.

### చింతూరులో దొంగల హల్‌చల్



చర్చి పాస్టర్ ఇంట్లో దొంగలు తెరిచిన బీరువాలు

**చింతూరు:** మండల కేంద్రం చింతూరులో మంగళవారం తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. ఇళ్లు, దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఎర్రంపేటలోని వస్త్ర దుకాణంలో ప్రవేశించి కౌంటర్‌లోని రూ.4 వేలను తస్కరించారు. తరువాత చింతూరులో సీఎస్ఐ చర్చి పాస్టర్ ఇంట్లోకి చొరబడ్డారు. చర్చి పక్కనే ఉన్న మెడికల్ షాపు వెనుకవైపు తలుపు తాళాలు పగులగట్టి షాపులోని రూ.6 వేలను చోరీచేశారు. ఆ పక్కనే ఉన్న ఇంటిలోకి చొరబడగా ఆ ఇంటి యజమానులు మేల్కొని కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. కాగా చర్చి పాస్టర్ ఇంట్లో కొన్ని ఇత్తడి, రోల్డ్‌గోల్డ్ వస్తువులను మూటగట్టి ఉంచిన దొంగలు పారిపోయే కంగారులో వాటిని అక్కడే వదిలేశారు. ఈ మేరకు బాధితులు చింతూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### ముగిసిన వాలీబాల్ పోటీలు



విజేతలతో క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి

**అరకులోయ రూరల్:** ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. 28, 29 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో 35 జట్లు పాల్గొనగా అరకులోయ క్రీడాపాఠశాల విద్యార్థులు మొదటిస్థానం, పెదబయలు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రెండోస్థానం, అరకులోయ గురుకులం(బాలురు)జట్టు మూడవస్థానం పొందినట్టు క్రీడాపాఠశాల ప్రిన్సిపాల్ పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు రాజాబాబు, అప్పలరాజు, బాలన్న, మాధవ, కొండలస్వామి, పీడీలు బాలి, సద్దు, కోటి, శ్రీనివాస్ సూరిబాబు, గణపతి,సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం భేష్

పాడేరు జిల్లా ఆస్పత్రిలో గతంలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది.సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మెరుగైన వైద్యం అందుతుండడంతో గిరిజనుల్లో నమ్మకం ఏర్పడింది. ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది.

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఉన్నత వైద్యం
- అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు
- పెరిగిన ఓపీ



రక్తపరీక్షల విభాగం వద్ద రోగుల రద్దీ

**సాక్షి,పాడేరు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. గత ప్రభుత్వం పాడేరు ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ ఉన్నత వైద్యసేవలు,స్పెషలిస్టుల పోస్టుల భర్తీ,ఇతర సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలతో కూడిన ఉన్నత వైద్యానికి ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత నాలుగేళ్లలో పాడేరు జిల్లా ఆస్పత్రి దఫదఫాలుగా అన్ని సౌకర్యాలు కల్పించారు. గతంలో కేజీహెచ్‌కు రోగులను తరలించే రిఫరల్ ఆస్పత్రిగా మాత్రమే మిగిలిపోయిన ఈ ఆస్పత్రిలో ఇప్పుడు శస్త్రచికిత్సలు చేస్తూ, మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు భరోసా ఏర్పడింది. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతిరోజూ ఇక్కడ ఓపీ 300పైనే ఉంటుంది.ఈ వారంలో మరింత పెరిగింది. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో మంగళవారం 391మంది జిల్లా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందినట్టు వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలోని ఇన్, అవుట్ పేషంట్‌లందరికీ 24గంటల పాటు వైద్య సేవలు కల్పిస్తున్నారు.

**అందుబాటులో సౌకర్యాలు**

వ్యాధి నిర్ధారణకు సంబంధించిన సౌకర్యాలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. సీటీ స్కాన్, ఈసీజీ,ఎక్స్‌రే,వెంటిలేటర్లు,సెంట్రల్ ఆక్సిజన్ సౌకర్యాలు రోగులకు ఎంతో మేలు చేస్తున్నాయి. కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఇక్కడి డయాలసిస్ సెంటర్ నిరంతరం పనిచేస్తోంది. కేన్సర్ నిర్ధారణకు సంబంధించి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. అధునాతనమైన ల్యాబ్ సౌకర్యం ఉండడంతో అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తూ సకాలంలో వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. ఎముకలు స్త్రీ,చిన్నపిల్లలు, నేత్ర విభాగం,మత్తు వైద్యనిపుణులతో పాటు జనరల్ సర్జన్ వైద్యులు,ఎంబీబీఎస్ వైద్యులంతా పూర్తిస్థాయిలో ఉండడంతో రోగులకు సత్వరమే వైద్యసేవలందుతున్నాయి. వైద్యంతో పాటు సంపూర్ణ పౌష్టికాహారం అందిస్తున్నారు.



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

### నిరంతరం అప్రమత్తం

జిల్లా ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యసౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి వ్యాధిగ్రస్తునికి సత్వరం వైద్య సేవలందిస్తున్నాం. వైద్యనిపుణులు ఉండడంతో అత్యవసర రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలలో గాయపడిన వారిని గతంలో కేజీహెచ్‌కు పంపే పరిస్థితి ఉండేది. వైద్యులు అందుబాటులో ఉండడంతో ఇక్కడే శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నాం.జిల్లా ఆస్పత్రిలో 24గంటలూ వైద్య సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ కె.కృష్ణారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, పాడేరు

## జోరుగా సప్పర్ల ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు

- ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4.30 కోట్లు మంజూరు
- 10 కిలోమీటర్ల మేర నిర్మాణం



సప్పర్ల ఘాట్‌రోడ్డులో జరుగుతున్న నిర్మాణ పనులు

**సాక్షి,పాడేరు:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ సుమిత్ కుమార్ గిరిజన ప్రాంతాల్లోని పెండింగ్ రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారించారు. గతంలో అటవీ శాఖ అడ్డంకులు,కరోనా సమయంలో సాంకేతిక ఇబ్బందులతో నిలిచిపోయిన గూడెంకొత్తవీధి నుంచి సీలేరు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. పలు సార్లు కలెక్టర్ ఈ రోడ్డులో ప్రయాణించారు. అధ్వాన రోడ్డును పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక పంపారు. నూతిబంద గ్రామం నుంచి సప్పర్ల ఘాట్ మీదుగా రెయిన్‌గేజ్ ప్రాంతం వరకు 10 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4.30 కోట్లను కలెక్టర్ మంజూరు చేశారు. ఈనిధులతో 3.66 మీటర్ల పక్కా తారురోడ్డు పనులను ఆర్అండ్‌బీశాఖ చేపట్టింది.రోడ్డు అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయి. సప్పర్ల ఘాట్‌లోని రెయిన్‌గేజ్ అవతల నుంచి సీలేరు వరకు రోడ్డు అభివృద్ధి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.పలుచోట్ల సీసీలు కూడా పూర్తి చేస్తున్నారు. జి.కే.వీధి నుంచి నూతిబంద వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నామని,అంచనాలను కలెక్టర్‌కు నివేదించినట్టు ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు 'సాక్షి'కి తెలిపారు.

## 30 నుంచి పాలిసెట్ తుదివిడత కౌన్సెలింగ్

- ప్రిన్సిపల్ డాక్టర్ సుజాత



డాక్టర్ సుజాత

**సాక్షి,పాడేరు:** పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 నుంచి తుదివిడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్టు స్థానిక ప్రభుత్వ ఆదర్శ ఆశ్రమ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత మంగళవారం తెలిపారు. ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 1 వరకు ఫీజుల చెల్లింపు, ధ్రువీకరణపత్రాల పరిశీలన,సెప్టెంబర్ 2న ఆప్షన్ల ఎంపిక, సెప్టెంబర్ 4న సీట్ల కేటాయింపు ప్రక్రియ ఉంటుందన్నారు.సెప్టెంబర్ 7వతేదీ లోపు విద్యార్థులు జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలని ఆమె చెప్పారు.అర్హులైన విద్యార్థులు ఈచివరి దశ కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## గిరిజనుల స్థితిగతులపై ట్రైనీ ఐఏఎస్‌ల అధ్యయనం



గిరిజనుల నుంచి వివరాలు సేకరిస్తున్న ట్రైనీ ఐఏఎస్



గిరిజనులతో ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

**సీలేరు:** ట్రైనీ ఐఏఎస్‌ల బృందం జిల్లాలో మారుమూల దుప్పులవాడ పంచాయతీలోని గ్రామాల్లో మంగళవారం పర్యటించింది. గిరిజనుల స్థితిగతులు, జీవన శైలి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలా చేరుతున్నాయి అన్న విషయాలను అధ్యయనం చేసేందుకు ఏడుగురు సభ్యుల బృందం మూడు రోజుల పాటు పర్యటించనుంది. మొదటి రోజు నడిమిగుడ, బందవీధి, రాంపు, రేవళ్లమడుగు, రష్యాగుడ గ్రామాలకు వెళ్లిన ట్రైనీ ఐఏఎస్‌లు గ్రామస్తులతో మమేకమయ్యారు. వారి నుంచి పంటల సాగు వివరాలు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, తాగునీరు, రహదారి సౌకర్యం, ఇళ్ల నిర్మాణం, గంజాయి సాగు, దాని వల్ల వచ్చే అనర్థాలు, ప్రత్యామ్నాయ పంటలు సాగు తదితర వివరాలు సేకరించారు. వారి వెంట మండల విస్తరణాధికారి పాపారావు, సెక్రటరీ వెంకటరావు, సర్పంచ్ కేలేపు కుమారి, మండల సీడీపీవో లక్ష్మి ఉన్నారు.

## నేటి నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థి కొలత తీస్తున్న అధికారులు

**ఆరిలోవ:** విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల నియామకాల కోసం బుధవారం నుంచి మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో ఈ నెల 25 నుంచి పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం పురుష అభ్యర్థులకు పరీక్షలు చేశారు. రేంజ్ పోలీస్ అధికారులు 800 మంది అభ్యర్థులకు హాల్‌టిక్కెట్లు పంపగా వారిలో 589 మంది హాజరయ్యారు. వారికి పరుగు, లాంగ్ జంప్, కొలతలు తీసి, సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి సెప్టెంబరు 2వరకు మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2,745 మంది మహిళా అభ్యర్థులకు నాలుగు రోజులపాటు పరీక్షలు జరుపుతామన్నారు.

## వినియోగదారుల ఆరోగ్య భద్రతే లక్ష్యం

జిల్లా ఆహార భద్రత అధికారి వేణుగోపాల్



రంపచోడవరంలో బేకరీలో తనిఖీలు చేస్తున్న జిల్లా ఆహార భద్రత అధికారి వేణుగోపాల్

**రంపచోడవరం:** వినియోగదారుల ఆరోగ్యభద్రతే తమ లక్ష్యమని, వారి ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యాపారులను వదిలిపెట్టేది లేదని జిల్లా ఆహార భద్రత అధికారి బి.వేణుగోపాల్ తెలిపారు. రంపచోడవరంలో మంగళవారం పలు స్వీట్స్, బేకరీ,కిరణా షాపులను తనిఖీ చేశారు. స్వీట్స్ తయారు చేసే కేంద్రాల వద్దకు వెళ్లి పరిశీలించారు. రెండు బేకరీల్లో స్వీట్స్ తయారీ కోసం ఉపయోగించే నూనెను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీపీసీ రీడింగ్ 25 దాటిన నూనెతో తయారుచేసిన ఆహారపదార్థాలు తినడం వల్ల క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉందన్నారు. అటువంటి నూనెను వినియోగించి ఆహార పదార్థాలు తయారు చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 14 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇక నుంచి ప్రతి రోజూ జిల్లాలో ఏదో ఒక చోట తనిఖీలు నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు. ఆహార భద్రతశాఖకు సిబ్బంది కొరత ఉందన్నారు. దానిని అధిగమించి పనిచేస్తామని తెలిపారు. ప్రతి వ్యాపార సంస్థకు ఫుడ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆహార పదార్థాలు విక్రయించే వారు కచ్చితంగా ఫుడ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. జిల్లాలో దశల వారీగా వ్యాపారులకు ఆహారం నిల్వ చేసే టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

## ఆటోలో ప్రసవం



బిడ్డను ఆటోలో నుంచి దింపుతున్న వైద్యసిబ్బంది

**చింతూరు:** గంగన్నమెట్టకు చెందిన ఓ గిరిజన మహిళ మంగళవారం ఆటోలో ప్రసవించింది. గ్రామానికి చెందిన మడివి రాధకు పురిటినొప్పులు రావడంతో ఆటోలో చింతూరు ఏరియా ఆస్పత్రి తరలిస్తుండగా నొప్పులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో మార్గమధ్యంలో కుటుంబసభ్యుల సహకారంతో ఆశావర్కర్ ఆటోలోనే రాధకు ప్రసవం చేశారు. ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.

## పనుల్లో జాప్యం జరిగితే సహించను

ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



బంగారుమెట్టలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు:** అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో ఆమె మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు మండల కేంద్రంలో అందుబాటులో ఉంటూ జవాబుదారీతనంతో విధుల నిర్వహించాలన్నారు. భవనాలు,రోడ్లు తదితర పనుల్లో జరుగుతున్న జాప్యం అధికారుల నిర్లక్ష్యానికి అద్దంపడుతోందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయకపోతే ఉపేక్షించేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ సీతమ్మ,వైస్ ఎంపీపీ భాగ్యవతి,ఎంపీడీవో రమేష్,ఎంఈవో కృష్ణమూర్తి,సీడీపీవో వరహాలమ్మ,ఏపీఎం దేవమంగ,జీసీసీ మేనేజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన సేవలు**

గిరిజన ప్రాంతంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంతో క్షేత్రస్థాయిలో వైద్యసేవలు మెరుగుపడ్డాయని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు.బంగారుమెట్టలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలించి, ఓపీ రికార్డులు తనిఖీ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఇద్దరు గర్భిణులను మెరుగైన వైద్యసేవల కోసం సీహెచ్‌సీకి తరలించాలని వైద్యాధికారి శిరీషకు సూచించారు.ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం వల్ల గిరిజన పల్లెల్లో ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతున్నాయని, వైద్యం కోసం పంచాయతీ,మండల కేంద్రాలకు వెళ్లే బాధలు తప్పాయని చెప్పారు. అంతకుముందు కిలగాడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు ఫీడర్ అంబులెన్స్ పరిస్థితిని గమనించి, వినియోగంపై ఆరా తీశారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలోని సీహెచ్‌సీని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.రాత్రి వేళల్లో వైద్య సేవలు అందుతున్న పరిస్థితి, వైద్యులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. వార్డులు పరిశుభ్రంగా లేకపోవడం ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భక్తి శ్రద్ధలతో సత్యదేవుని వ్రతాలు



ఎమ్మెల్యే ధనలక్ష్మికి వ్రతాల గురించి వివరిస్తున్న అధికారులు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

**రంపచోడవరం:** స్థానిక నారాయణగిరిపై గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం స్వామివారి సామూహిక వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా స్వామివారి వ్రతాలు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి.ఎల్.వి. రమేష్‌బాబు వ్రతాల విశిష్టత, ఏజెన్సీలో నిర్వహించే కార్యక్రమాలను ఎమ్మెల్యేకు వివరించారు. వ్రతాల్లో పాల్గొన్న భక్తులకు పూజ సామగ్రి, అన్నప్రసాదాన్ని అన్నవరం దేవస్థానం అధికారులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నవరం ఆలయం సూపరింటెండెంట్ కంచి మూర్తి, ద్వారక తిరుమల ఆలయ ఏఈవో సతీష్, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల అభీష్టం మేరకే కాలనీల నిర్మాణం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్డీసీ రమణ

**చింతూరు:** నిర్వాసితుల అభీష్టం మేరకే భూసేకరణ నిర్వహించిన అనంతరం కాలనీల నిర్మాణం చేపట్టనున్నట్టు ఆర్అండ్ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమణ తెలిపారు. చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు ఏలూరు జిల్లా తాడ్వాయి, తూర్పుగోదావరి జిల్లా యాదవోలు వద్ద స్థలసేకరణకు కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. నిర్వాసితులు వాటిని పరిశీలించి వారికి ఎక్కడ కావాలో ఆమోదం తెలిపితే అక్కడ భూసేకరణ జరుపుతామన్నారు. ప్రతి కుటుంబానికి ఐదుసెంట్లు స్థలం కేటాయిస్తామని చెప్పారు. ఎకరంలో 12 ఇళ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. కాలనీలు నిర్మించే ప్రాంతంలో అన్నిరకాల మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నిర్వాసితులకు ఉపాధి మార్గాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్డీసీ తెలిపారు.

**ఉపాధి అవకాశాలు కల్పించాలి**

దశాబ్దాలుగా వ్యాపారాలు, వ్యవసాయం, ఇతర పనులు చేసుకుంటూ జీవిస్తున్న తమను పోలవరం పేరుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్వం త్యాగం చేస్తున్న తమకు మంచి స్థలాలు కేటాయించడంతో పాటు ఆ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. యాదవోలు ప్రాంతంలో సేకరించబోయే భూముల్లో గ్యాస్‌పైపులైన్ ఉన్నందున అధికారులు ఇతర భూములను సేకరించాలని నిర్వాసితులు కోరారు. కాగా గతంలో ఏర్పాటు చేసిన పీడీఎఫ్ కమిటీపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో దానిని రద్దుచేసి కొత్తగా కమిటీ ఏర్పాటు చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎటపాక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, చింతూరు తహసీల్దార్ కారం సుబ్బారావు, వీఆర్‌పురం తహసీల్దార్ శ్రీధర్, కార్యదర్శి ప్రసాదరావు, వీఆర్వో రామచంద్రం పాల్గొన్నారు.

## ఉద్యానవనాల పెంపకంతో అధిక ఆదాయం



కిండ్ర కాలనీలో గిరిజన రైతులకు టిష్యూ కల్చర్ అరటి మొక్కలు పంపిణీ చేస్తున్న సైంటిస్టులు

**రాజవొమ్మంగి:** గిరిజన రైతులు కేవలం వరి తదితర సంప్రదాయ పంటలు మాత్రమే కాకుండా వాణిజ్య విలువ గల ఉద్యానవనాల సాగును కూడా చేపట్టాలని వైఎస్సార్ ఉద్యానవన విశ్వ విద్యాలయం (కొవ్వూరు) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రామానందం అన్నారు. రాజవొమ్మంగి మండలం క్రిండ కాలనీలో రైతులకు పలు ఉద్యానవన పంటల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఉద్యాన పరిశోధనా కేంద్రం, అఖిల భారత పండ్ల తోటల సమన్వయ పథకం కింద ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవనాల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు.అరటిలో అధునాతన సేద్యం పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ ఎ.స్నేహలతారాణి, స్థానిక ఉద్యానవన శాఖ సహాయకులు రామరాజు, నాగరాజు, అభ్యుదయ రైతు మల్లుదొర పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గ్రూప్-1 విజేత జీవన పడాల్‌కు సన్మానం



డీఎస్పీగా ఎంపికైన చిట్టపులి జీవన పడాల్‌ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**పాడేరు రూరల్ :** లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేస్తే గిరిజన యువత మెరుగైన ఫలితాలను సాధించవచ్చని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన గిరిజన యువతి చిట్టపులి జీవన పడాల్‌ను, ఆమె తల్లిదండ్రులను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవన పడాల్‌ను గిరిజన నిరుద్యోగ యువత ఆదర్శంగా తీసుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) పి.అనిల్‌కుమార్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎల్. హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

### 108లో ప్రసవం



108లో మహిళకు ప్రసవం

**మారేడుమిల్లి:** మండలంలోని మద్దివీడు గ్రామానికి చెందిన పల్లాల ప్రేమకుమారి అనే గర్భిణి 108లో ప్రసవించింది. ప్రేమకుమారికి మంగళవారం పురిటి నొప్పులు రావడంతో భర్త వెంకటరెడ్డి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఏరియా ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గ మధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. కోరుకొండ వద్ద ఈఎంటీ కె.కల్యాణ్, పైలెట్ బి. నాగేశ్వరరావు ఆమెకు 108 వాహనంలో ప్రసవం చేశారు.మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం రాజమహేంద్రవరం ఆస్పత్రి తరలించారు.

# జగనన్న పాలనలో ప్రతీ రైతు రాజే

**ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర**



పెద్దపుట్టులో రైతుకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జలిపల్లి సుభద్ర

**ముంచంగిపుట్టు:** సీఎం జగనన్న పాలనలో ప్రతి రైతూ రాజేనని ఉమ్మడి జిల్లాల పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలో కించాయిపుట్టు పంచాయతీ పెద్దపుట్టు గ్రామంలో, బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ సుభద్ర గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడు రైతుల ఎదుగుదల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. గతంలో రైతులకు విత్తనాలు ఆలస్యంగా పంపిణీ జరిగేదని.దీంతో రైతలు తీవ్ర ఇబ్బందులు పడేవారని ఇప్పుడు ముందస్తుగానే విత్తనాల పంపిణీ జరగడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ప్రభుత్వం కల్పించే ప్రతి రాయితీలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని, ముఖ్యంగా 90శాతం రాయితీపై ఆర్‌బీకేల ద్వారా గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు అందిస్తోందన్నారు. రైతులంతా వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు తప్పక పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాంధించాలన్నారు. మండలంలో మొత్తం 837 మందికి ఒక రోజే రాజ్‌మా విత్తనాలు అందించడం జరిగిందన్నారు. ఆర్‌బీకే కేంద్రాల్లో రాజ్‌మా విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. అంతకముందు సుజనకోట పంచాయతీ కొత్తసుజనకోట గ్రామంలో గడప గడప నిధులు రూ.5లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఎంపీపీ అరిపెల సీతమ్మ, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచ్‌లు భాగ్యవతి, బాబూరావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, గణపతి, విజయలక్ష్మి, ఏవో ఎం.శ్రీనివాస్ బాబు, ఎస్.రవీంద్ర, నేతలు కొండలరావు, మూర్తి, జగన్నాథం, సురేష్, పులిరాజు, అర్జున్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదాయాన్ని పెంచాలి

**రంపచోడవరం:** పంచాయతీల ఆదాయాన్ని పెంచేందుకు సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో జీఎల్ఎన్ రాఘవన్ తెలిపారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల విస్తరణ అధికారులు (పి. ఆర్. డిఆర్ డి ), పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం రిజిస్టర్ నిర్వహించాలని, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది జీతాల పెంపునకు అవసరమైన ఆదాయం పెంపునకు కృషి చేయాలన్నారు.

బకాయి ఇంటి పన్నులు వెంటనే వసూళ్లు చెయాలని, ప్రభుత్వ భవనాలకు, వ్యాపార సంస్థలకు ఇంటి పన్ను విధించాలని ఆదేశించించారు. ప్రతీ గ్రామ పంచాయతీ ఖచ్చితంగా గ్రామానికి కనీసము ఒక క్లాప్ మిత్రలను నియమించి, పారిశుధ్య కార్యక్రమములు నిర్వహించాలన్నారు. పంచాయతీ రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామ పంచాయతి ప్రాపర్టీ రిజిస్టర్ శనివారము లోపు తయారీ చేసి సెప్టెంబర్ నెలాఖరుకు ఇంటి వసూలు ప్రారంభించాలని ఆదేశించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్లు సక్రమంగా నిర్వహణ బాధ్యతలు వ్యవసాయ, ఉద్యానవన సహాయకులకు అప్పగించాలన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ చేయాలని, ఈ బాధ్యతను వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు అప్పగించాలన్నారు. డివిజన్ డవలప్‌మెంట్ అధికారి కె.కోటేశ్వరరావు మాట్లాడుతూ పంచాయతీల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాల్లో నూరుశాతం నమోదు పూర్తిచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

### గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

**మోతుగూడెం :** పోర్‌బై పవర్ కెనాల్లో సెల్ఫీ దిగుతూ గల్లంతైన జీవేస్ సోనీ(30) మృతదేహం మంగళవారం లభ్యమైంది. చత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట గ్రామానికి చెందిన సోనీ ఈ నెల 27న స్నేహితులతో కలిసి పోర్‌బై వద్ద పవర్ కెనాల్ వద్దకు వచ్చాడు. కెనాల్ వద్ద సెల్ఫీ దిగుతుండగా అదుపు తప్పి కెనాల్‌లో పడి కొట్టుకుపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మోతుగూడెం పోలీసులు చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ గోపాలరావు తెలిపారు.

### నేటి నుంచి దివ్యాంగ బాలల జిల్లా స్థాయి క్రీడలు

**చోడవరం రూరల్:** అనకాపల్లి జిల్లా విద్యాశాఖ, ఏపీ సమగ్ర శిక్ష, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ సెంటీనియల్ సమన్వయంతో బుధవారం నుంచి జిల్లా స్థాయి దివ్యాంగ బాల బాలికల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. జూనియర్, సీనియర్ కేటగిరీల్లో బుద్ధి మాంద్యం, వినికిడి, దృష్టిలోపం, దివ్యాంగ బాలలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రన్నింగ్, షార్ట్‌పుట్, సాఫ్ట్ బాల్, స్లో వాకింగ్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, జావలిన్ త్రో, అసిస్టెడ్ వాక్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 18 ఏళ్ల లోపు వయసున్న దివ్యాంగ బాలలు పాల్గొనవచ్చన్నారు.

# పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



శిక్షణ ప్రారంభించిన సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి

**సామర్లకోట:** గ్రామాల్లో కొత్త లేఅవుట్ల ఏర్పాటుకు సంబంధించి నిబంధనల అమలుపై పంచాయతీ కార్యదర్శులకు పూర్తి స్థాయి అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం సీనియర్ ఫ్యాకల్టీ శ్రీదేవి అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్- 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించే రెసిడెన్షియల్ శిక్షణను ఈటీసీలో ఆమె మంగళవారం ప్రారంభించారు. శిక్షణ సమయంలో గ్రామ సచివాలయం, పంచాయతీలలోను సాధారణ పరిపాలనకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లేఅవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు బి.ఆంజనేయులు, నీహారిక శిక్షణ ఇచ్చారు.

# ప్రకృతి సేద్యంపై నేపాల్ బృందం అధ్యయనం



మట్టుజోరులో ప్రకృతి వ్యవసాయంపై అధ్యాయనం చేస్తున్న నేపాల్ బృందం

**డుంబ్రిగుడ/హుకుంపేట:** జిల్లాలో ప్రకృతి వ్యవసాయంపై నేపాల్ దేశం నుంచి వచ్చిన బృందం అధ్యయనం చేసింది. డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం ఈ బృందం పర్యటించి, ప్రకృతి సేద్యం, జీవామృతం తయారు చేసే పద్ధతిని పరిశీలించింది. డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీలోని కిల్లోగుడ,బలియగుడ గ్రామాల్లో సంజీవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ పర్యటన సాగింది. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా మేనేజర్ భాస్కరరావు,రిసోర్స్ పర్సన్ దేవుళ్లు, పలువురు రైతులు పాల్గొన్నారు. హుకుంపేట మండలంలో రంగశీల, పెదగరువు, పాదిలి, మాసాడ, కుంతుర్ల, మట్టుజోరు గ్రామాల్లో పంటలను ఆరుగురు సభ్యులు గల బృందం పరిశీలించినట్టు ప్రకృతి వ్యవసాయ విభాగం డీఎం భాస్కరరావు తెలిపారు. మట్టుజోరులో వి.చైతమ్మ అనే మహిళా రైతుతో బృందం సభ్యులు మాట్లాడారు. ఆమె వద్ద 100 రకాల విత్తనాల పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్ఆర్‌పీ దేముళ్లు,సుధకార్,పండన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**పాడేరు రూరల్ :** ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ, కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పాడేరులో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తలార్‌సింగి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల మైదానంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పలు క్రీడా పోటీలను నిర్వహించారు. వాలీబాల్, ఖోఖో, క్రికెట్, హాకీ, చెస్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ కొండలరావు, పాఠశాల హెచ్ఎం రీమలి జాన్ ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా పాల్గొని, విజేతాలకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ పోటీలో బాలికల విభాగంలో పాడేరు గిరిజన గురుకుల పాఠశాల, బాలుర విభాగంలో అల్లంపుట్టు బాలుర పాఠశాల, ఖోఖోలో సీఏహెచ్ పాఠశాల తలార్‌సింగి, క్రికెట్‌లో పాడేరు సెయింటాన్స్ పాఠశాల, హాకీలో తలార్‌సింగి సీఏహెచ్ పాఠశాల, చెస్‌లో సెయింటాన్స్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ స్కూల్స్ ప్రిన్సిపాల్ మూర్తి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎ. జగన్మోహన్‌రావు, జిలా క్రీడాప్రాధికార సంస్థ కార్యదర్శి సూరిబాబు, పీడీ. పీఈటీల సంఘం అధ్యక్షుడు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# ఫీడర్ సేవలు మరింత విస్తృతం



శోభకోటలో ఫీడర్ అంబులెన్స్ సేవలను పరిశీలిస్తున్న ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసు

**హుకుంపేట:** మన్యంలో మారుమూల గ్రామల్లో ఫీడర్ సేవలు మరింత విస్తృతం చేయాలని జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ మూడు జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని శోభకోటలో ఆయన పర్యటించి, ఫీడర్ అంబులెన్స్ సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మన్యంలో మారుమూల గ్రామాల్లో గిరిజనులకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన సేవలను విస్తృతంగా అమలుచేయాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వైఎస్సార్ సంచార పశు వైద్య ఆరోగ్య సేవలు, ఫీడర్ అంబులెన్స్ సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సూపర్‌వైజర్ గంగాధర్, ఈఎంటీ మత్స్యరాజు, మణికంఠం, సిబ్బంది సాయి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా వాహనాల అడ్డగింత



ఇసుక వాహనాలను అడ్డుకొని, రహదారి మధ్యలో గొయ్యి తవ్వుతున్న గ్రామస్తులు

**హుకుంపేట:** మండలంలోని తీగలవలస పంచాయతీ గరుడాపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేయవద్దని ఇసుక వాహనదారులను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇసుక క్వారీ మార్గంలో గ్రామస్తులంతా కలిసి వాహనాలు వెళ్లకుండా మధ్యలో ఓ పెద్ద గొయ్యి తీశారు. ఇసుక తీయడం వలన భవిష్యత్‌లో తమ ప్రాంతంలో ఇసుక దొరకడానికి ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వాహనచోదకులు తమ ప్రాంతంలో రాకూడదని హెచ్చరించారు. తమ ప్రాంతంలో ఇసుక వాహనాలు వచ్చినట్లు సమాచారం తెలిస్తే సహించేది లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చంద్రబాబు, లోకేష్‌పై ఫిర్యాదు



ఎస్‌ఐ కుమార్‌బాబుకు ఫిర్యాదు పత్రం అందజేస్తున్న సోషల్‌మీడియా కన్వీనర్ రంజిత్ కుమార్



జి.మాడుగుల సీఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సురేష్‌కుమార్

**జి.మాడుగుల/అనంతగిరి/ముంచంగిపుట్టు/ అరకు లోయ:** రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోషల్‌మీడియా ప్రతినిధులు పోలీసు స్టేషన్లలో మంగళవారం ఫిర్యాదు చేశారు. జి.మాడుగులలో సీఐ సత్యనారాయణకు వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తెడబరికి సురేష్‌కుమార్,సోషల్‌మీడియా కో-కన్వీనర్ కొంతెరి గోపాల్,సోషల్ మీడియా మండల కన్వీనర్ కల్యాణం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ముగ్గురిపై కేసులు నమోదుచేసి అరెస్టు చేయాలని సీఐ సత్యనారాయణను కోరారు. ఈ కార్యక్రమంలో సొలభం ఎంపీటీసీ చిన్నారావు పాల్గొన్నారు. అనంతగిరిలో స్థానిక ఎస్‌ఐ కరక రాముకు వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ మోస్య రంజిత్ ఫిర్యాదు చేశారు.ముంచంగిపుట్టులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ చెట్టి ఉదయ్‌కుమార్, సోషల్ మీడియా సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో అరకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కో-కన్వీనర్ కె.దాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.పులిరాజు పాల్గొన్నారు. అరకులోయలో వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ రంజిత్‌కుమార్, అరకు నియోజకవర్గం కన్వీనర్ నర్సింగరావు ఫిర్యాదు చేశారు.

# 80 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

**పరారైన నిందితుడి కోసం గాలింపు**



పట్టుబడిన గంజాయితో పోలీసులు

**చీడికాడ:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 80 కిలోల గంజాయిని పట్టుకున్నామని ఎస్‌ఐ పి.రామారావు మంగళవారం తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లి కూడలి వద్ద ఉదయం తమ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా, బైలపూడికి చెందిన ముగ్గురు నిందితులు రెండు ద్విచక్ర వాహనాలపై నాలుగు మూటలతో గంజాయి తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. గొల్లవిల్లి గణేష్, గొల్లవిల్లి నీలకంతేశ్వరరావులను పట్టుకోగా, మరో నిందితుడు మూటను విడిచిపెట్టి పరారైనట్టు తెలిపారు. మొత్తం నాలుగు మూటల్లో 80 కిలోల గంజాయితోపాటు ఒక బైకు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

# జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలో స్వర్ణం



విద్యార్థి రోహిత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

**కోటకోట:** స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థి ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్ పోటీలో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించాడు. ఈ స్కూలులో నాలుగో తరగతి చదువుతున్న ఆడారి రోహిత్ అండర్ -12 కటా విభాగంలో విజేతగా నిలిచాడు. ఈ మేరకు విద్యార్థితోపాటు కరాటే కోచ్ సిహెచ్. సూరిఅప్పారావులను ప్రిన్సిపాల్ రూపానంది, అకడమిక్ ఇన్‌చార్జి పి. చంద్రమౌళి తదితరులు మంగళవారం అభినందించారు.

# తల్లి నేత్రాలు దానం చేసిన తనయులు



రాజారత్నం నేత్రాలు తీసుకుంటున్న వైద్యులు

**రావికమతం:** సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. ఆ కుమారులకు మాత్రం తమ అమ్మ నిరంతరం తమకు బోధించిన మాటలే గుర్తున్నాయి. బతికి ఉన్నా, మరణించినా నలుగురికీ ఉపయోగపడాలిరా.. అదీ బతుకంటే అని చెప్పిన తల్లి ఆశయాన్ని ఆ పుత్రులు నెరవేర్చారు. ఆమె మరణంతో ఆ కళ్లను దానం చేసి, అమ్మ చూపిన బాటలో నడిచారు. మేడివాడ గ్రామానికి చెందిన కొనగళ్ల రాజారత్నం(70) మంగళవారం సహజ మరణం చెందారు. దీంతో ఆమె కుమారులు సురేష్, రాము, లక్ష్మణరావులు పుట్టెడు దుఃఖంలోనూ తల్లి నేత్రాలను దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించిన రాజా రత్నం ఆది నుంచీ పదుగురికి సాయపడుతూ వచ్చారు. సేవా ధర్మమే తమను రక్షిస్తాయని నమ్మేవారు. ఆమె కుమారులకూ అదే చెబుతూ వచ్చేవారు. మరణానంతరం మరొకరికి ఉపయోగపడే పనిచేయాలని తరచూ కుమారులతో చెబుతూ వచ్చేది. మంగళవారం ఆమె సహజమరణం చెందగా, తల్లి కోరిక మేరకు ఆమె నేత్రాలను దానం చేసేందుకు విశాఖ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిని సంప్రదించారు. అక్కడి వైద్యులు వచ్చి ఆమె నేత్రాలను సేకరించి వెళ్లారు. శోకంలోనూ మరో ఇద్దరికి చూపునివ్వాలన్న ఆ కుమారుల గొప్పతనాన్ని వైద్యులతోపాటు, గ్రామస్తులు కొనియాడారు.

# ఖాజీపాలెంలో క్యాన్సర్ ల్యాబ్

- పైలట్ ప్రాజెక్టును ప్రారంభించిన అనకాపల్లి ఎంపీ, కలెక్టర్
- అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ టెస్టుల కోసం ఏర్పాటు



ఖాజీపాలెంలో క్యాన్సర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

**అచ్యుతాపురం(అనకాపల్లి):** క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన, స్క్రీనింగ్ కోసం అనకాపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు ఎంపీ డాక్టర్ సత్యవతి తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన ల్యాబ్‌ను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో క్యాన్సర్‌పై అవగాహన పెంచేందుకు పైలట్ ప్రాజెక్టులో భాగంగా అనకాపల్లి తిరుపతిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. అగనంపూడిలోని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చి సిబ్బంది, ఇక్కడి ల్యాబ్‌లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ ఖాజీపాలెంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహిస్తూ, పరీక్షా ఫలితాల ఆధారంగా అవసరమనుకుంటే అగనంపూడి క్యాన్సర్ ఆస్పత్రికి పంపిస్తారని వెల్లడించారు. ఇక్కడి వైద్య పరీక్షలపై ప్రజల స్పందన, ఫలితాల మేరకు జిల్లాలో మరికొన్ని చోట్ల ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో మరింత చైతన్యం రావాల్సి ఉందన్నారు. అందుకే ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఇటువంటి ల్యాబ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. డీఎంహెచ్‌వో హేమంత్ మాట్లాడుతూ ఈ ల్యాబ్‌లో క్యాన్సర్‌కి సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే, దాని నివారణకు మెరుగైన వైద్యం అందించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమర వర్మ, ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి, అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, స్థానిక వైద్యాధికారులు రజని, కల్యాణి, ఎంపీపీ కోన సంధ్య, పీలా నర్సింగరావు, పిన్నమరాజు వాసు, కోన బుజ్జి పాల్గొన్నారు.